## ప్రజలకు సేవలందించడంలో బీజేపీ ముందంజ



విద్యార్థినికి మెమొంటోను అందజేస్తున్న ముక్కా కృష్ణాగుప్తా, విజయ్ యాదవ్

అబిడ్స్: ప్రజలకు సేవలందించడంలో బీజేపీ ముందుంటుందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ముక్కా కృష్ణాగుప్తా, స్వచ్ఛభారత్ కార్యక్రమ ఇన్చార్జి విజయ్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం బేగంబజార్ పరిసర ప్రాంతాల్లో బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ సేవాభావాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ శాంతి అవార్డు



అఫ్జల్‌గంజ్: 25 ఏళ్లుగా నిరంతరం సమాజ సేవ చేస్తూ బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ పీస్ అవార్డు-2025కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ నెల 21న అంతర్జాతీయ శాంతి దినోత్సవం సందర్భంగా ఈ అవార్డుకు ఏనుగు జంగారెడ్డిని ఎంపిక చేసినట్లు వివరించారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జెడ్పీటీసీగా, గ్రామీణ అభివృద్ధి, యువకుల సంక్షేమం, మహిళా అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడుతూ గతంలో పలు అవార్డులను ఆయన అందుకున్నారు. నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు శాంతి, సామరస్య, మత సామరస్యం కోసం, పర్యావరణ పరిరక్షణ కోసం ఉచిత ఆరోగ్య కేంద్రాలు నిర్వహిస్తూ లయన్స్ క్లబ్‌ద్వారా జంగారెడ్డి పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపడుతున్నందుకు గ్లోబల్ పీస్ అవార్డు అందజేస్తున్నట్లు రాజ్‌నారాయణ్ ముదిరాజ్ తెలిపారు.

## ఘనంగా మిలాద్ ఉన్ నబీ జల్సా



గోల్కొండ: ప్రవక్త మహ్మద్ సకల ప్రపంచానికి శాంతిదూత అని రహబర్‌ఏ మిల్లత్ మౌలానా సయ్యద్ ఆలే మహ్మద్ షబ్బీర్ పాషా ఖాద్రీ అన్నారు. శనివారం టోలిచౌకీ సలార్ జంగ్ కాలనీలోని వైట్ హౌజ్‌లో వార్షిక జల్సా మిలాద్ ఉన్ నబీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడుతూ..ప్రవక్త మహ్మద్ జీవితం ప్రపంచానికి ఒక తెరిచి ఉంచిన పుస్తకం అని ఆయన జీవితంలోని ప్రతి ఘట్టం ఎన్నో విలువైన సందేశాన్ని ఇస్తుందన్నారు. ఖాజామోహియుద్దీన్, ఇక్బాల్ ఖాద్రీ ముల్తానీ, మౌలానా ముర్షద్ పాషా, ప్రముఖ నెప్రాలజిస్టు డాక్టర్ మహ్మద్ షోహెబ్ అహ్మద్ ఖాన్, సాప్ గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ ఆకీబ్ అహ్మద్‌ఖాన్, సాప్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ మహ్మద్ నియాజ్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

## గ్లేన్ రన్ విజేత బొమ్మల దేవిక



గోల్కొండ: ప్రీప్రైమరీ విద్యార్థులకు నిర్వహించే గ్లేన్ రన్ పరుగు పోటీల్లో చిన్నారి బొమ్మల దేవిక వరుసగా రెండో సారి చాంపియన్‌గా నిలిచింది. శనివారం జరిగిన పోటీల్లో విజేతగా నిలవగా గ్లేండెల్ అకాడమీ ఇండోర్ ఈవెంట్ కో ఆర్డినేటర్ ఫణీకుమార్ ఆమెకు బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బొమ్మల దేవిక ఇటు చదువు అటు పరుగు పందెంలో కూడా రాణిస్తుందని ఈ రెండింటిలో ఆమెకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్లేండెల్ అకాడమీ డ్యాన్స్ మాస్టర్ విజయ్‌కుమార్, బి.సాయి బాబాచారి, బి.శ్రీకాంత్‌చారి తదితరులున్నారు.

## రౌడీషీటర్‌కు ఏడాది పాటు నగర బహిష్కరణ



మహ్మద్ అసద్

శాలిబండ: కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన రౌడీషీటర్‌ను ఏడాది పాటు నగర బహిష్కరణ చేస్తూ ఉత్తర్వులు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..కాలాపత్తర్ బిర్యానీషా టెకిడి ప్రాంతానికి చెందిన మహ్మద్ అసద్ (27) కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్. కాగా మహ్మద్ అసద్‌పై దాడి, హత్య, హత్యాయత్నం, క్రిమినల్ బెదిరింపులు, అల్లర్లు, బలవంతపు వసూళ్లు, ఆయుధాలను అక్రమంగా కలిగి ఉండటం వంటి నేరాలతో పాటు 11 క్రిమినల్ కేసుల చరిత్ర ఉంది. అసద్‌పై ఫిర్యాదులు, క్షేత్రస్థాయి విచారణలు పోలీసు అధికారుల నివేదికల ఆధారంగా ప్రజా శాంతి, ప్రజాస్వామ్యానికి ముప్పు అని తేల్చారు. దీంతో రౌడీషీటర్‌ను అసద్‌ను హైదరాబాద్ నుంచి ఏడాది పాటు బహిష్కరిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# శరన్నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- ఈనెల 22 నుంచి ఉత్సవాలు ప్రారంభం
- ప్రతిరోజు వివిధ అలంకరణలతో దర్శనం ఇవ్వనున్న అమ్మవార్లు
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాల నిర్వాహకులు



మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం



సుల్తాన్‌షాహీ జగదాంబ దేవాలయం



ఉప్పుగూడ మహంకాళి ఆలయం

చార్మినార్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి నిర్వాహకులు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు ప్రత్యేక దర్శనం ఇవ్వనున్నారు. పాతబస్తీలో నిజాం కాలం నుంచి పూజలందుకుంటున్న ఆలయాల్లో ఈ ఉత్సవాలు ఘనంగా జరుగనున్నాయి. అన్ని అమ్మవారి ఆలయాలతో పాటు మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయం, సుల్తాన్‌షాహీలోని జగదాంబ ఆలయం, ఉప్పుగూడ మహంకాళి ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగనున్నాయి.

### మీరాలంమండిలో..

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు తెల్లవారుజామున 3 గంటలకు సుప్రభాత సేవ, మహాభిషేకం, అలంకరణ, చతుష్షష్ఠి ఉపచార మహాపూజ, 10 పారాయణంలు, చండీహోమం, పూర్ణాహుతి, నైవేద్యంతో పాటు సాయంత్రం 5 గంటలకు సామూహిక సహస్రనామ కుంకుమార్చన ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపోత్సవం, ఊంజల్ సేవ, రాత్రి 7.30 గంటలకు పంచహారతి, సామూహిక హారతి, గౌరిపూజ తదితర పూజా కార్యక్రమాలతో పాటు పాటు 8:30 గంటలకు అన్నప్రసాదంతో పాటు రాత్రి 11:35 గంటలకు అమ్మవారికి ఏకాంత సేవ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి.

### జియాగూడ మహంకాళి ఆలయంలో..

జియాగూడ: జియాగూడ మహంకాళి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్, ధర్మకర్త గొడుగు ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. శనివారం ఆలయంలో ఉత్సవాల వివరాలు వెల్లడించారు. జియాగూడ మహంకాళి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు.

### సంజయ్‌నగర్ నల్లపోచమ్మ గుడిలో..

సంజయ్‌నగర్ నల్లపోచమ్మ, తుల్జాభవాని, దుర్గాదేవి మందిరాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ రావుల సుదర్శన్‌రావు, ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. దహిమ భజన మండలి గాయకుడు మురారి ధహిమ ఆధ్వర్యంలో భజనలు కొనసాగుతాయి.

### ముత్యాలమ్మ ఆలయంలో..

నాంపల్లి: బజార్‌ఘాట్ ఎక్స్ రోడ్‌లోని బంగారు ముత్యాలమ్మ ఆలయంలో దసరా శరన్నవ రాత్రి మహోత్సవాలు ఈ నెల 22న సోమవారం ప్రారంభమై అక్టోబరు 2వ తేదీ గురువారంతో ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అమ్మవారిని 11 రోజుల పాటు ప్రత్యేక అలంకరణలతో విశేష అభిషేకార్చనలతో అత్యంత వైభవముగా పూజలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

### ఫిలక్‌మాత ఆలయంలో..

దబీర్‌పురా: ఫర్హత్‌నగర్‌లోని ఫిలక్‌మాత ఆలయంలో ఈ నెల 22న నుంచి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రూప మహేందర్ తెలిపారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరిస్తున్నారు.

### నవరాత్రులకు ఘనంగా ఏర్పాట్లు..

చాంద్రాయణగుట్ట: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా ఉప్పుగూడ రాఘవేంద్రస్వామి నగర్‌లోని జమ్మిచెట్టు దుర్గామాత ఆలయంలో ఈసారి 34వ వార్షిక శరన్నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 22న ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలు అక్టోబర్ 2వ తేదీ వరకు పెద్ద ఎత్తున కొనసాగుతాయన్నారు. ప్రతిరోజు అమ్మవారిని వివిధ అలంకార రూపాలలో భక్తులకు దర్శనమిస్తారని జమ్మిచెట్టు రాజు, శ్రీనివాస్, నరేష్, అరవింద్ రావ్ పేర్కొన్నారు.

### 9 రోజుల పాటు అమ్మవారికి విశేషాలంకరణ



22న సుప్రభాత సేవతో ఉత్సాలను ప్రారంభించనున్నాం. 22న బాలత్రిపుర సుందరీ దేవి, 23న గాయత్రి దేవి, 24న అన్నపూర్ణ దేవి, 25న కాత్యాయన దేవీ, 26న మహాలక్ష్మీ దేవీ, 27న లలితా త్రిపుర సుందరి దేవీ, 28న మహాచండీ దేవీ, 29న సర స్వతీ దేవి, 30న దుర్గాదేవి, వచ్చే నెల 1న మహిషాసుమర్దని దేవి, 2న రాజారాజేశ్వరి దేవి తదితర రూపాల్లో అమ్మవారికి విశేషాలంకరణ చేయనున్నాం. ఈ 10 రోజుల్లో ప్రతిరోజూ 10 పారాయణంలతో పాటు చండీహోమం నిర్వహించనున్నాం.
– గాజుల అంజయ్య, మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్

### ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నాం



నగరంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉత్సవాలను నిర్వహించనున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల సందర్భంగా పలువురు సినీ ప్రముఖులతో పాటు అధికార, అనధికార ప్రముఖులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 2న మహా పూర్ణాహుతి, అమ్మవారి రథయాత్ర నిర్వహించనున్నాం.
– రాకేష్ తివారి, సుల్తాన్‌షాహీ జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్

### అన్ని ఏర్పాట్లు చేశాం



ఉప్పుగూడ మహంకాళి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేశాం. ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2 వరకు జరిగే వేడుకల్లో పాల్గొనే భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేశాం. ఉత్సవాల్లో భాగంగా వచ్చే నెల 1న, చండీహోమం నిర్వహించనున్నాం. 2న విజయ దశమి, ఆయుధపూజ, శమి పూజ తదితర కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నాం.
– జనగామ మధుసూదన్ గౌడ్, ఉప్పుగూడ మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్

## షేక్ మహ్మద్ ఇలియాస్‌కు డాక్టరేట్ ప్రదానం




షేక్ మహ్మద్ ఇలియాస్‌కు డాక్టరేట్ అందజేస్తున్న హెచ్‌ఈ అలెమ్ టిషాయే ఓల్డెమారియం

అబిడ్స్: డాక్టర్ షేక్ మహ్మద్ ఇలియాస్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. అబిడ్స్ మెథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల కంప్యూటర్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మహ్మద్ ఇలియాస్ ఆన్ ఎన్హాన్స్ క్లౌడ్ డేటా సెక్యూరిటీ విత్ హైబ్రిడ్ ఎన్కోడింగ్ అండ్ అడ్వాన్స్ కీ ఎక్స్ఛేంజ్ మెకనిజమ్స్ అనే శోధన గ్రంథంపై పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. ఆయన పరిశోధన ఆధునిక కంప్యూటింగ్‌లో అత్యంత కీలకమైన క్లౌడ్ డేటా భద్రత సమస్యలపై దృష్టి సారించింది. అడ్వాన్స్ కీ ఎక్స్ఛేంజ్‌తో పాటు డేటాభద్రత కల్పించడం, క్లౌడ్ డేటాను సురక్షితంగా ఉంచే విధానాలను అభివృద్ధి చేశారు. ఈ ఆధునాతన పరిశోధనను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ వి.సత్యదుర్గ మార్గదర్శకత్వంలో పూర్తిచేశారు. ఆయన పరిశోధన ఫలితాలు స్కోపస్ సూచిక జర్నల్స్‌లో కూడా ప్రచురించారు. శనివారం చెన్నైలో జరిగిన హిందుస్తాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కన్వొకేషన్‌లో డాక్టర్ షేక్ మహ్మద్ ఇలియాస్‌కు డిప్లొమాటిక్ కార్ప్స్ డీన్ హెచ్‌ఈ అలెమ్ టిషాయే ఓల్డెమారియం, నాస్కామ్ అధ్యక్షులు రాజేష్ నంబియార్‌లు పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసి ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇలియాస్‌ను మెంథడిస్ట్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రెటరి కె.కృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుజి బెనాకాప్, కంప్యూటర్ సైన్స్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ పి.లావణ్య, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.లక్ష్మీపతిరావు అభినందించారు.

## రమణీయం..నందనార్ చరితం



గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ, వెంకట్ ఆర్ట్స్ అకాడమి, కూచిపూడి పరంపర ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో 'నందనార్ చరితం 'అనే కూచిపూడి నృత్య రూపకాన్ని శనివారం రవీంద్రభారతిలో ప్రదర్శించారు. ఆ కాలంలోని ఆచార వ్యవహారాలు, అన్నమయ్య సంకీర్తనల మాధుర్యం కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శోభారాజ్ మాట్లాడుతూ..నందనార్ ఒక గొప్ప భక్తుడని, భక్తికి కుల, మత, ప్రాంతీయ బేధాలు లేవని, అన్నమయ్య సంకీర్తనలలో సైతం ఆ భావం కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ నృత్య రూపకాన్ని వెంకట్ రచించగా దీపా నారాయణ్ శిష్యబృందం అద్భుతంగా నర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త గరికపాటి వెంకట్, సీనియర్ పాత్రికేయులు బండారు రామ్మోహన్‌రావు, శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పంచామృత సహిత రుద్రాభిషేకం



దబీర్‌పురా: కోమటివాడి శ్రీరామ ఆలయంలో శనివారం మాస శివరాత్రిని పురస్కరించుకొని పంచామృత సహిత రుద్రాభిషేకం, శివ అర్చన, సహిత రుద్రాభిషేకం, మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను బొంగులూరి రాంమూర్తి శాస్త్రి, బొంగులూరి విశ్వం, బొంగులూరి శ్రీను పంతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

## ఆచార్య బాల భాస్కర్‌కు సత్కారం



ఆచార్య బాల భాస్కర్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

చార్మినార్: ఏ పదవిలో ఉన్నా జీవితంలో సిటీ కళాశాలను మరిచిపోలేనని కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ఆచార్య బాల భాస్కర్ అన్నారు. సిటీ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా సేవలందించి పదోన్నతిపై కళాశాల కమిషనరేటుకి సంయుక్త సంచాలకులుగా వెళ్తున్న బాల భాస్కర్‌కి కాలేజీ స్టాఫ్ క్లబ్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం శనివారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సిటీ కాలేజీకి ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు నిర్వహించడం తన అదృష్టమని, నాలుగేళ్ల కాలంలో అందరి సమష్టి కృషి వలన కాలేజీకి దేశంలోనే అత్యున్నత గ్రేడ్ సాధించగలిగామని గుర్తు చేసుకున్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్ల, స్టాఫ్ క్లబ్ సెక్రెటరీ డా.శంకర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు బాల భాస్కర్‌ని ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

## సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



స్నాతకోత్సవంలో సందడి చేస్తున్న విద్యార్థులు

గన్‌ఫౌండ్రీ: సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని యూఎస్ డెలాయిట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఛాయరావు అన్నారు. శనివారం కింగ్‌కోఠిలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ, పీజీ కళాశాలలో పీజీ మినీ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి గ్రాడ్యుయేట్‌లు విజయాలు, వ్యక్తిగత పట్టుదలను మాత్రమే కాకుండా యువ మంచ్‌లను శక్తివంతం చేయడంలో ముఖ్య పాత్రను పోషించాలన్నారు. అంతకు ముందు విద్యార్థులు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బాలశౌరి, ఓయూ పరీక్షల విభాగం నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కె.శశికాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఆంథోని సగయరాజ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలు

జియాగూడ: జియాగూడ విద్యాశ్రీ హై స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. శనివారం స్కూల్ ప్రిన్సిపాల్ సునితా శ్యామ్ వెరా ఆధ్వర్యంలో హగ్ స్కూల్ విద్యార్థినీలు, ఉపాధ్యాయులు సంప్రదాయంగా బతుకమ్మలను పేర్చి పూజలు చేసి స్కూల్ ప్లే గ్రౌండ్‌లో బతుకమ్మలు, కోలాటం ఆడారు. అనంతరం ప్రసాద వితరణ జరిగింది.



వేడుకల్లో విద్యశ్రీ స్కూల్ డైరెక్టర్ శ్యామ్‌వెరా, ప్రిన్సిపాల్ సునితా శ్యామ్

### ఆసిఫ్‌నగర్‌లో..

విజయనగర్‌కాలనీ: ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల రంగు రంగుల అలంకరించిన బతుకమ్మలను విద్యార్థులు పేర్చి సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా ఆడారు. ప్రిన్సిపల్ శశికళ, విద్యావేత్తలు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హైస్కూల్ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, ప్రైమరీస్కూల్ కో ఆర్డినేటర్ కె.ఫర్హానా, ఈ కిడ్డి కో ఆర్డినేటర్ రష్మికతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆసిఫ్‌నగర్ నారాయణ పాఠశాలలో..


## దరఖాస్తుల ఆహ్వానం

సుల్తాన్‌బజార్: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న పలువురి ప్రముఖులకు ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డాక్టర్ గజగళ్ల విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్య, వైద్యం, సామాజిక సేవలు, పర్యావరణ పరిరక్షణ, నృత్యం, క్రీడలు, కళలు, సాహిత్యం, చిత్రలేఖనం, శాస్త్రీయ సంగీతం, ఆధ్యాత్మికం, ఉపాధి కల్పన తదితర రంగాల్లో అందిస్తున్న సేవలతో పాటు ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను అందజేస్తామన్నారు. పేర్ల నమోదుకు 93913 79903లో సంప్రదించాలని సూచించారు.

## జిగ్నేష్ దోషిపై కేసు నమోదు

సుల్తాన్‌బజార్: తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన గుజరాతి ప్రగతి సమాజ్ ప్రతినిధి జిగ్నేష్ దోషిపై సుల్తాన్‌బజార్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల కాలంలో 'మార్వాడీ గో బ్యాక్'ఉద్యమం నేపథ్యంలో ఓ టీవీ ఛానల్‌లో జిగ్నేష్ దోషి అనే వ్యక్తి తెలంగాణ ప్రజలు ఉదయం లేవగానే రూ.1000, రూ.2 వేలు ఉంటే తాగి పడుకుంటారని అనే అనుచిత వ్యాఖ్యలపై తెలుగు భాషా సంఘం అధ్యక్షుడు బి.సతీష్‌గౌడ్ ఆగస్టు 21న సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో లీగల్ అడ్వైజ్ తీసుకున్న పోలీసులు శనివారం జిగ్నేష్ దోషిపై కేసు నమోదు చేశారు.

## మజ్లిస్ సీనియర్ నాయకుడి మృతి



సిరాజ్ ఖాన్ పట్టేదార్(ఫైల్)

గోల్కొండ: మజ్లిస్ సీనియర్ నాయకుడు, గోల్కొండ నయాకీలా ఏరియా కమిటీ అధ్యక్షుడు సిరాజ్ ఖాన్ పట్టేదార్(50) శనివారం ఉదయం మృతి చెందారు. శనివారం తెల్లవారుజాము బాత్‌రూమ్‌లోకి వెళ్లిన ఆయన కాలుజారి పడి తలకు తీవ్ర గాయం కావడంతో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్త తెలియగానే ఎమ్మెల్యే కౌసర్, కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, సీనియర్ నాయకులు హారూన్‌ఫరాన్, అజీజ్‌ఖాన్ పటాన్, ప్రముఖ న్యాయవాది మిర్జా ఎక్బార్ అహ్మద్‌లు సిరాజ్ ఖాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చాంద్రాయణగుట్ట: రౌడీషీటర్లు తమ ప్రవర్తనను మార్చుకోకుండా సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తే ఉక్కుపాదంతో అణచివేస్తామని ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య హెచ్చరించారు. ఠాణా పరిధిలోని 32 మంది రౌడీషీటర్ల కదలికల విషయమై ఆయన శుక్రవారం రాత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించి, కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు ఎక్కడ పని చేస్తున్నారు? స్థానికంగా సామాన్యుల పట్ల గూండాయిజం చేస్తున్నారా...? అనే విషయాలపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

## ఆకట్టుకున్న పూర్వ విద్యార్థినుల సమ్మేళనం




నృత్యం చేస్తున్న పూర్వ విద్యార్థినులు

గోల్కొండ: మెహిదీపట్నంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో పూర్వ విద్యార్థినుల ఆత్మీయ సమ్మేళనం శనివారం ఘనంగా జరిగింది. అన్సారీ అలుమ్నీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రీకనెక్ట్ అండ్ రీఫ్లెక్ట్ థీమ్‌తో జరిగిన ఈ సమ్మేళనం ఆద్యాంతం ఆకట్టుకుంది. సెయింట్ ఆన్స్ కళాశాల 42 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పైలెట్ కెప్టెన్ సయ్యదా సల్వా, ప్రముఖ సైంటిస్ట్ డాక్టర్ దీపా జైశ్వాల్, కళాశాల కరస్పాండెంట్ మరియా రాణి, కో ఆర్డినేటర్ శ్రీకళ, డీన్ అడ్మిన్ డాక్టర్ అనురాధ, డాక్టర్ ఉషశ్రీ, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ రాధేయి, నాజియా, ఫాతిమా పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్‌ను సత్కరిస్తున్న మీర్ హైదర్ అలీ జాఫ్రీ తదితరులు

చార్మినార్: శాంతి భద్రతల పరిరక్షణకు స్థానికుల సహకారాలు ఎంతో అవసరమని మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ అన్నారు. సురేష్ కుమార్‌ను శనివారం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మీర్ హైదర్ అలీ జాఫ్రి ఆధ్వర్యంలోని నాయకుల బృందం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలందరికీ శాంతి భద్రతల పరిరక్షణలో రౌండ్ ది క్లాక్ సేవలు ఉంటాయన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడైనా ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే తమను సంప్రదిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో జైనుల్ ఆబేదుద్దీన్, అగారజా తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పడాల అనంతకృష్ణ

జియాగూడ: బతుకమ్మ వేడుకల నాటికి కేసరి హనుమాన్ మూసీనది ఒడ్డున ఉన్న సమస్యలను పరిష్కరించాలని కార్వాన్ క్రాంతిభవన్, శివశంకర క్రాంతి సేవా సమితి అధ్యక్షులు పడాల అనంత కృష్ణ, ప్రతినిధులు పాశం ప్రణయ్‌రామ్, వివేక్‌రావు, ప్రవీణ్ శనివారం జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్, జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేసరి హనుమాన్ మూసీనది ఒడ్డున చెత్తాచెదారం, మహిళలు బతుకమ్మలను వదలడానికి నదిలోకి వెళ్లడానికి దిగే మెట్లు సరిగా లేవని వాటికి మరమ్మతులు జరుపాలన్నారు. అలాగే 500 తాత్కాలిక వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, మూసీ నదికి వెళ్లే కేసరి హనుమాన్ రహదారులను శుభ్రం చేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరగా వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు.